<u>తన పని కాదు</u>

# చట్టం బాలకృష్ణ పని చేస్తోంది

**"చట్టం తన పని తాను చేసుకుపోతుంది"** అనీ,
**'ఎంత పెద్దవారయినా చట్టం కంటే చిన్నవారే'**ననీ గంభీరంగా అంటుంటారు.
బాలకృష్ణ అరెస్టు ప్రహసనం చూసిన తరువాత ఈ మాటలు ఇంకెప్పుడూ ఎవరూ అనకుండ ఉంటే బాగుంటుందని చాలామందికి అనిపించే ఉంటుంది.

అతను వర్తమాన తెలుగు సినిమా రంగంలోని ప్రముఖ నటులలో ఒకడట. అయి ఉండవచ్చు. మాకు తెలీదు. ప్రస్తుతం అతను ఒక తీవ్రమైన నేరం చేసిన వ్యక్తి. ఒకటేమిటి, రెండు తీవ్రమైన నేరాలు చేసిన వ్యక్తి. బుద్ధెరిగి ఇద్దరి మీద కాల్పులు జరిపి వారిని తీవ్రంగా గాయపరిచాడు. ఆ సంగతి తెలియబరిచే సాక్ష్యాలను మాయం చేసే ప్రయత్నం చేశాడు. వేరే ఎవరైనా ఇటువంటి పనులు చేస్తే ఈపాటికి కట కటాల వెనుక భద్రంగా ఉండేవారు. బెయిలు ఎప్పుడు వస్తుందిరా దేవుడా అని ఘడియలూ ఊచలూ లెక్కపెడుతుండేవారు. ఈ లోపల ఏదయినా జ్వరమొచ్చినా ఒళ్లు నొచ్చినా 'సార్! రెండు గోలీలియ్యండి' అని జైలు డాక్టరు రౌండ్స్‌కు వచ్చినప్పుడు చేతులు ముడుచుకొని అడుక్కుంటుండేవారు. 'ఫో! వెధవా! పని ఎగ్గొట్టడానికి నాటకాలు ఆడుతున్నావ్' అని తిట్టించుకుంటూ ఉండేవారు.

ఇతను? నేరం చేసిన క్షణం నుంచి ఆస్పత్రిలో ఉన్నాడు. ఒక ఘరానా ప్రైవేట్ ఆస్పత్రిలో ఉన్నాడు, మరొక ఘరానా ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్నాడు. అతనిని కటకటాల వెనుక పెట్టి కాపలా కాయవలసిన పోలీసులు ఆస్పత్రి బయట అతను ఎప్పుడు దయతలచి తమ చేతికి చిక్కుతాడా అని పడిగాపులు కాస్తున్నారు. 'పని ఎగ్గొట్టడానికి నాటకాలు ఆడుతున్నావా' అనవలసిన డాక్టర్లు ఒకరితో ఒకరు పోటీపడి అతని ఆరోగ్య పరిస్థితి సీరియస్‌గా ఉందని రుజువు చేస్తున్నారు. కాకర్ల సుబ్బారావుగారే స్వయంగా చేస్తున్నారు. మొదట శరీరానికి గాయం అయిందన్నారు. చిన్నదేగదా అంటే, అప్పుడెప్పుడో కాలికి తగిలిన గాయానికి తీసుకున్న మందుల ఫలితంగా వేలికి తగిలిన గాయం రక్తస్రావం ఆగకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. సైన్స్ మహిమ ఎంతటిది కదా! అని అచ్చెరువొందాము. అయితే పాడు వేలు బాగయిపోయిందని స్పష్టం అయిన తరువాత శరీరం బాగానే ఉందిగానీ అతగాడి మనసుకే సమస్య వచ్చిందని అన్నారు. ఏమొచ్చిందంటే అదే చెప్పకుండ ఊరికే నిద్రపోతున్నాడన్నారు. అయినప్పటికీ అతని చేత చెప్పించి నిష్ణాతులయిన మానసిక వైద్యుల చేత వైద్యం చేయిస్తామన్నారు. తమ ఆస్పత్రిలో లేకపోతే ఎర్రగడ్డ నుంచి తెప్పిస్తామన్నారు. వేరే ఎవ్వరూ కాదు, నిమ్స్ డైరెక్టర్ కాకర్ల సుబ్బారావు గారే స్వయంగా అన్నారు. ఇవాళ్టిదాకా అంటూనే ఉన్నారు.

బాలకృష్ణను కటకటాల నుంచి కాపాడడానికి చాలామంది తమ పరువు చాలా పోగొట్టుకున్నారు గానీ ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు గారంతగా వేరే ఎవరూ పోగొట్టుకోలేదు. ఏ పక్షపాతం వారిచేత ఈ పని చేయించిందో గానీ వారింకెప్పుడూ ఒక పెద్దమనిషిగా తలెత్తుకు తిరగలేరు. తిరగలేకుండ తానే చేసుకున్నారు. గొప్ప త్యాగి.

కేర్ ఆస్పత్రి పెద్దలు కాదు కాదన్నా ఒక విషయం స్పష్టం అయింది. మీరు ఎంత పెద్ద నేరం చేసి ఉన్నా ఫరవాలేదు. ఆ ఆస్పత్రి దండుకునే ఫీజు చెల్లించే స్థోమత మీకుంటే చాలు, నేరుగా 'కేర్'లో అడ్మిట్ అయిపోవచ్చు. వారు ఎంఎల్‌సి గింఎల్‌సి అనకుండ నేరుగా ఇంటెన్సివ్‌కేర్‌లోనే మిమ్మల్ని పెట్టేస్తారు. గతంలో సిద్ధార్థరెడ్డిలాగ మీరు ప్రాణానికి అపాయం లేకుండ పురుగుల మందు కొంచెం మాత్రమే తాగివున్నా, ఇప్పుడు బాలకృష్ణ లాగ చిన్న వేలికి చిన్న గాయం చేసుకొని ఉన్నా, వసుంధర లాగ చెప్పుకోవడానికి ఏ రోగం రొష్టూ లేకున్నా ఫరవాలేదు. నేరుగా ఇంటెన్సివ్‌కేర్‌లోనే మిమ్మల్ని 'కేర్' పెడుతుంది.

అదేం నేర్పోగానీ చిన్న రోగమైనా కూడా నయం కాకుండా చూస్తుంది కేర్. బాలకృష్ణ వేలికి గాయం 3వ తేదీ రాత్రి అయిందంట. 'విదిన్ మినిట్స్' అన్నట్టు కేర్ ఇంటెన్సివ్‌కేర్‌లో పడ్డాడు. కానీ 5వ తేదీన వేలికి రక్తం ఇంకా ధారగా కారుతూనే ఉందని లక్ష్మీపార్వతి అన్నారు. అవును, ఇంకా కారుతూనే ఉందని అక్కినేని నాగేశ్వరరావూ అన్నారు. ఒక నేరస్థుడికి అంతటి సేవ ఎన్ని ఆస్పత్రులు చేయగలవు!

ఒక హత్యో, హత్యా ప్రయత్నమో చేసినవాడు 'నాకు ఒంట్లో బాగలేదు – కొంచెం ఉండండి' అని దుప్పటి తన్ని ఇంట్లో పండుకుంటే పోలీసులు ఇంటి బయట పడిగాపులు కాయరు. నీ రోగాన్ని మేము నయం చేస్తాము రా అని తీసుకుపోతారు. కానీ ఇద్దరు ప్రముఖ పోలీస్ ఆఫీసర్లు నేరస్థుడికీ అతని వైద్యులకూ ఎప్పుడు దయకలుగుతుందా అని ఇంటి బయట చక్కర్లు కొట్టే స్థితికి తమను తాము నెట్టుకున్నారు. ఆర్.పి.సింగ్‌గారూ, ఎ.కె.ఖాన్‌గారూ అసమర్థులని ఇప్పటివరకూ ఎవరూ అనలేదు. ఖాన్‌గారయితే నల్లగొండ ఎస్.పి.గా ఉన్నప్పుడూ,

అంతకు ముందూ, ఆ తరువాతా 'అసాంఘిక శక్తులను ఏరివేయడం'లో అత్యంత నిర్దాక్షిణ్యంగా వ్యవహరించిన ఘనత గలవారు. ఏ నేరమూ చేయకపోయినా చేస్తారనీ, చేయగలరనీ అనుమానించిన వారిని సహితం వారు విడిచిపెట్టలేదు. అటువంటిది, జీవితఖైదు పడగల కాగ్నైజబుల్ నేరం చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకోవడానికి ఎన్ని తిప్పలు పడుతున్నారో. చట్టం ముందు అందరూ సమానమని ఇంకెప్పుడూ మీరు అనరుకదా, ఖాన్ సాబ్? ఏ నేరం చేయని బాలకృష్ణ కారు డ్రైవర్‌నూ, వంట మనిషి, పనిమనుషులను కేవలం సాక్షులన్న కారణంగా వెంటనే అదుపులోనికి తీసుకోగలిగిన మీరు నేరస్థులయిన బాలకృష్ణనూ, వసుంధరనూ అదుపులోకి ఎందుకు తీసుకోలేక పోయారో కొంచెం ఆలోచిస్తారా? చట్టాన్ని అక్రమంగా చేతిలోకి తీసుకునే వారిని నిర్దాక్షిణ్యంగా నిరోధించే ఘనత గల మీరు, చట్టాన్ని చేతిలోకి తీసుకునే సర్వ అధికారాలూ ఉండికూడా దానిని తీసుకోలేకపోవడం వెనుక ఉన్న విచిత్రమైన అశక్తత గురించి కొంచెం వివరిస్తారా?

**ఒక హత్యో, హత్యా ప్రయత్నమో చేసినవాడు 'నాకు ఒంట్లో బాగలేదు – కొంచెం ఉండండి' అని దుప్పటి తన్ని ఇంట్లో పందుకుంటే పోలీసులు ఇంటి బయట పడిగాపులు కాయరు. నీ రోగాన్ని మేము నయం చేస్తాము రా అని తీసుకుపోతారు. కానీ ఇద్దరు ప్రముఖ పోలీస్ ఆఫీసర్లు నేరస్థుడికీ అతని వైద్యులకూ ఎప్పుడు దయకలుగుతుందా అని ఇంటి బయట చక్కర్లు కొట్టే స్థితికి తమను తాము నెట్టుకున్నారు.**

పోలీసులూ ఆస్పత్రులేకాదు బాలకృష్ణ సేవలో పత్రికలు కూడా తమ పరువు చాలావరకు పోగొట్టుకున్నాయి. నిజానికి అందువల్లనే మేము ఈ విషయాలను కరపత్రం రూపంలో ప్రజల వద్దకు తీసుకుపోవలసి వచ్చింది. ప్రకటన ఇస్తేనో, వ్యాఖ్య రాస్తేనో ఏ పత్రికా ప్రచురించే పరిస్థితి కనిపించలేదు. 4వ తేదీ పేపర్ చదవకుండా, 5వ తేదీ నుంచి పేపర్లు చదువుతున్న వారెవరైనా బాలకృష్ణ నేరస్థుడు కాడనీ, బాధితుడనీ అనుకునే ప్రమాదం ఉంది. అతని ఆరోగ్యాన్ని గురించి దైనందిన బులెటిన్‌లు, అతని వ్యక్తిత్వ వైచిత్రి గురించి సానుభూతిపూర్వకమైన వ్యాఖ్యలు, అతనిని దర్శించుకోవడానికి వచ్చిపోతున్న ప్రముఖుల ఊరడింపు సందేశాలు, రాజీ ప్రయత్నాల గురించి లేటెస్ట్ రూమర్‌లు – ఇంతటి సత్కారం ఏ నేరస్థుడికయినా మీడియా ఎప్పుడయినా ఇచ్చిందా?

## ఈ ప్రహసనానికి ముగింపెప్పుడు?

నేరం జరిగిన రెండవరోజే హోంమంత్రి జానారెడ్డి 'చట్టం తన పని తాను చేసుకుపోతుంది' అని యథావిధిగా ప్రవచించారు. అయితే ఆ మాత్రం ప్రవచించడానికి కూడా వారు ముఖ్యమంత్రితోనూ, డిజిపితోనూ మొదట సమావేశం అయ్యారంట. అంటే వారు ఆమోదిస్తేనే చట్టం అని పిలవబడే అతీతశక్తి తన పని తాను చేసుకుపోతుందా? మరుసటి రోజు ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిగారు చెన్నైలో విలేకరుల వద్ద అదే ప్రవచనాన్ని పునరుద్ఘాటించారు. అయితే 'మా ప్రభుత్వం తొందరపడి ఏమీ చేయదు' అనీ, 'ఆచి తూచి వ్యవహరిస్తుంది' అనీ కూడా అన్నారు. ఆచితూచి వ్యవహరించడానికి ఇదేమైనా సున్నితమైన సామాజిక సంక్షోభమా? అయినా కాంగ్రెస్ వారి ఆచడం తూచడం తెలుగుదేశం వారికి చాలలేదు. బాలకృష్ణను అరెస్టు చేయడానికే సాహసించని పోలీసులను పట్టుకొని అతనిని 'వేధిస్తున్నారు, సతాయిస్తున్నారు' అంటూ తెలుగుదేశం నాయకులు నిరసన తెలిపారు. ఇంకా ఏం చేస్తే చంద్రబాబుకు సంతోషం కలిగి ఉండేదో. నగర పోలీస్ కమిషనర్ స్వయంగా ఎఫ్ఐఆర్‌ను చింపేసి నిందితుడికి సన్మానం చేసి ఈ మాత్రం కష్టపెట్టినందుకు క్షమాపణ కోరుకొని ఉంటే సంతోషం కలిగి ఉండేదా?

చట్టం సాధారణ మానవులకే తప్ప ఘరానా వ్యక్తులకు వర్తించదన్న పద్ధతిలో వ్యవహరిస్తే, ఆ చట్టం విలువ కోల్పోతుందనీ, దానిని గురించి నీతులు వల్లించే అర్హత పాలకులు కోల్పోతారనీ గుర్తించడం పెద్దగా కష్టం కాదుగానీ ఎవరి సంకుచిత ప్రయోజనాలలో వారు తలమునకలయి ఉండడం వల్ల మన రాష్ట్ర పాలకులు గుర్తించలేకపోతున్నారు. ఇక్కడ పాలకులంటే అర్థం కేవలం పాలక పార్టీ అని కాదు. సమాజాన్ని శాసించే అధికారం గల పెద్దలు అని అర్థం. డబ్బు, అధికారం, హోదా ఉన్న వాళ్లు హత్యలు చేసినా పోలీసులకు చిక్కకుండ ఆస్పత్రులలో తలదాచుకోగలరనీ వారికి తమ కథనం తయారు చేసుకోవడానికి అన్ని అవకాశాలూ పోలీసులు చేజేతులా ఇస్తారనీ, చివరికి వారిని కోర్టులో ప్రవేశపెట్టినప్పుడు ఒంట్లో బాగులేదంటే 'లక్షణంగా ఉన్నావు – నీకేమయింది జైలుకు పో' అనవలసిన మేజిస్ట్రేటుదొర నిమ్స్ వైద్యుల బృందానికి ముద్దాయిని అప్పగించి అతని ఆరోగ్యం బాగయిందని వారు సర్టిఫికేట్ ఇచ్చాకనే జైలుకు పంపుతానని హామీ ఇస్తారనీ, నిమ్స్ డైరెక్టర్‌గారు పైకి కనిపించనిదీ, తనకు సహితం అంతుచిక్కనిదీ అయిన మానసిక రోగం ఏదో ఉందంటూ బెయిలు దొరికేదాకా ముద్దాయిని ఆస్పత్రిలోనే ఉంచుతారనీ, ఈ లోపల అతను చేసిన నేరానికి గురయి అదృష్టంకొద్దీ ప్రాణాలతో బయటపడిన వారిపైన అన్నిరకాల ఒత్తిడులూ పెట్టి పెద్దలంతా కూడి రాజీ చేయించేస్తారనీ – పెద్దల న్యాయం ఈ విధంగా ఉంటుందనీ ప్రజలకు స్పష్టం అయింది.

ఈ ప్రజలు రేపేదయినా నేరాలు చేస్తే పోలీసులూ, కోర్టులూ వారిని కఠినంగా శిక్షించవచ్చు, చట్టం తన పనే కాదు అంతకంటె ఎక్కువ కూడా చేసుకుపోవచ్చు.

కాని ప్రజల గౌరవాన్ని పొందగలరా?

**14 జూన్ 2004**
హైదరాబాద్.

మానవహక్కుల వేదిక
(Human Rights Forum)